క్లుప్తంగా

మహానాడుకు కుప్పం నుంచి జనం తరలింపు

– తెల్లవారుజామున 4 గంటల నుంచే పయనం



బస్సులో కడపకు బయలుదేరుతున్న ప్రజలు

కుప్పం: తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు కుప్పం నుంచి టీడీపీ నాయకులు జనాన్ని తరలించారు. గురువారం గ్రామీణ ప్రాంతాల్లో యూనిట్ క్లస్టర్లు, బూత్ కన్వీనర్లు జన సమీకరణ చేశారు.

ప్రతి పంచాయతీకి బస్సు

ప్రతి పంచాయతీ నుంచి జనం తరలించేందుకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ప్రైవేటు బస్సులు, వాహనాలను సిద్ధం చేసి ప్రజలు, యువకులను తరలించారు.

ఒత్తిడి తెచ్చి..కడపకు తరలింపు

డ్వాక్రా మహిళలు, సంఘమిత్రలను అధికారుల నుంచి ఒత్తిడి తెచ్చి కడపకు తరలించారు. అంత తెల్లవారుజామున ప్రయాణం కష్టమని పలువురు ఆవేదన వ్యక్తం చేసినా వారి గోడు పట్టించుకోలేదు. దీంతో విధిలేక తప్పనిసరై వారంతా బయల్దేరి వెళ్లారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

వి.కోట: స్థానిక వాసవీమాత ఆలయ 12వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గోపూజ, గణపతిపూజ, వాస్తుపూజ, కలశ స్థాపన, యాగశాల ప్రవేశం, హోమాలు మొదలైనవాటిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆర్య వైశ్యులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైద్య శిబిరానికి స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

చౌడేపల్లె: మండలంలోని కాటిపేరి గ్రామ సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించిందని సర్పంచ్ సరిత, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి రమాదేవి సూపర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య నిపుణులు ఇక్కడ శిబిరంలో 206 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ వెంకట ప్రసాద్

పలమనేరు : లింగ నిర్ధారణ , అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకట ప్రసాద్ హెచ్చరించారు. పలమనేరు ఆర్‌డీఓ కార్యాలయంలో అడ్వైజరీ కమిటీ సమావేశం స్థానిక ఆర్‌డీఓ భవానీ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో ఆయా మండలాలు, పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా పెట్టాలన్నారు. లింగ నిష్పత్తి సమాన స్థాయికి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి జయరాములు, కన్వీనర్ మల్లికార్జున రెడ్డి, డివిజన్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులు, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రజలకు 'మహా'నాడు దెబ్బ!

–కడపకు ఆర్టీసీ బస్సుల తరలింపుతో ప్రయాణికులకు తప్పని అగచాట్లు

బైరాల: కడప జిల్లాలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడుకు ఆర్టీసీ బస్సులు తరలివెళ్లడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గంగజాతర సందర్భంగా బెంగళూరు, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో ప్రజలు చుట్టు పక్కల గ్రామాల బంధువుల ఇళ్లకు వచ్చారు. గురువారం తిరిగి వెళ్లడానికి బస్టాండుకు వెళ్లిన ప్రయాణికులకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో నరకయాతన అనుభవించారు. గంటల తరబడి వందలాది మంది ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. రెండు గంటలైనా ఒక్క బస్సు కూడా రాలేదని వాపోయారు. కొందరు అధిక చార్జీలు వెచ్చించి ప్రైవేట్ వాహనాల్లో గమ్యస్థానాలకు వెళ్లారు.

గిట్టుబాటు..కనికట్టు

పక్వానికి వచ్చినా కోయని మామిడి



పొలాల్లో వదిలేసిన టమాట



తాము అధికారంలోకి వస్తే రైతాంగ సంక్షేమానికీ ప్రాధాన్యత ఇస్తామన్న నారా చంద్రబాబునాయుడు ఎప్పటిలాగే తన నైజం చాటుకున్నారు. అధికారంలోకి వచ్చాక రైతాంగానికి పెట్టుబడి సాయం ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతన్నలు గిట్టుబాటు ధర లేక నష్టాలపాలవుతున్నారు. కనీసం పెట్టుబడి, కూలీల ఖర్చులు కూడా రాని పరిస్థితి మూలాన అప్పులే దిగుబడి అవుతున్నాయని వాపోతున్నారు.

- ధరల పతనంతో నష్టం
- కుదేలవుతున్న టమాట రైతన్నలు
- హామీలతో రైతాంగాన్ని దగా చేసిన చంద్రబాబు

సదుం: పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున టమాట సాగు చేస్తున్నారు. ఒక్క పుంగనూరు నియోజక వర్గంలోనే దాదాపు 10 వేల ఎకరాలలో టమటా సాగు చేస్తున్నారు. ఈసారి పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గత ఏడాది విపరీతంగా టమాటా ధరలు పెరగడంతో రైతులు లాభం కళ్లజూశారు. దీంతో ఈ పర్యాయం సాగు పెరిగింది. చౌడేపల్లె, సోమల తదితర ప్రాంతాలలో పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం టమాటా సాగు చేయడం విశేషం! ఎకరాకు సుమారు రెండు లక్షల రూపాయలకు పైబడే వ్యయం చేశారు. కానీ ప్రస్తుతం కిలో టమాటా పది రూపాయల లోపే ధర పలుకుతుండడంతో నష్టపోతున్నారు. కాయలకోత ఖర్చులూ రాక తోటలను వదిలేస్తున్నారు.

పుచ్చ, దోసదీ అదే తీరు

వేసవిలో సాధారణంగా పుచ్చ, దోసకు అధిక డిమాండ్ ఉంటుంది. ధరలు అధికంగానే ఉంటాయి. ఈసారి పుంగనూరు నియోజకవర్గంలో దోస 3 వేలు, పుచ్చకాయి 1,500 ఎకరాలలోను సాగు చేశారు. కానీ వాటిని కొనేవారు లేక రైతులే సంతలలో కిలో రూ. 10న చొప్పున విక్రయిస్తూ నష్టపోతున్నారు.

ధాన్యానికి అంతంతమాత్రమే


పుంగనూరు డివిజన్‌లో వరి సాగు సుమారు 1,758 హెక్టార్లలో చేసారు. ప్రస్తుతం క్వింటాలుకు సరాసరి రూ. 1800 నుంచి రూ. 2 వేలు మాత్రమే లభిస్తోంది. రైతులు నూర్పిళ్లు చేసిన వెంటనే పంటను విక్రయిస్తే ధర తక్కువ వస్తుందని, బాగా ఎండపెట్టి ఆరు నెలల తరువాత విక్రయిస్తే మంచి ధర వచ్చే అవకాశం ఉంటుందని ఏడీఏ శివకుమార్ తెలిపారు. ధరల పతనంతో నష్టపోతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మామిడి దెబ్బ

పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో వేలాది ఎకరాలలో మామిడి పంట సాగులో ఉంది. పంట భూములు సైతం తోటలుగా మారిపోయాయి. గత కొన్నేళ్లుగా మామి డికి గిట్టుబాటు ధర లభించడం లేదు. తోటల నిర్వహణకు లక్షలాది రూపాయలు వ్యయం చేస్తున్నా గిట్టుబాటు ధర మాత్రం రావడం లేదు. ఈసారి దిగుబడులు తగ్గినా ధరలు పెరగక పోవడం రైతులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. దీంతో కాయలు పక్వానికి వచ్చినా.. ధరలు పెరుగుతాయన్న ఆశతో కోయకుండా అలాగే తోటల్లో ఉంచుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బేనీషా రూ.15, పుల్లూర రూ.5, తోతాపురి రూ.10 వరకు మాత్రమే పలుకుతోంది.

ధరలేక పొలాలలోనే వదిలేసిన టమాట

పులిచెర్ల(కల్లూరు): మూడు నెలలుగా టమాట పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడి కాదు కదా..కనీసం కోత కూలి ఖర్చు కూడా రాకపోవడంతో టమాటాలు కోయకుండా అలాగే తోటలో వదిలేస్తుండడంతో అది కాస్తా పశువులకు మేతగా మారింది.



మతుకువారిపల్లె వద్ద కోయకుండా వదిలేసిన టమాట పంట

ధరల కోసం వేచిచూస్తున్నా



నాకు 15 ఎకరాల మామిడి తోట ఉంది. సుమారు రూ. 4 లక్షలపైనే వ్యయం చేశా. ఇప్పటి వరకు 15 టన్నుల వరకు కాయలు అమ్మినా లక్ష రూపాయల వరకు మాత్రమే వచ్చింది. రోజురోజుకూ ధరలు తగ్గిపోతుండడంతో కాయలు కోయకుండా అలాగే ఉంచేశా. మామిడికి గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-హరినాథరెడ్డి, కంభంవారిపల్లె

ప్రభుత్వం ఆదుకోవాలి



సుమారు రూ. 5 లక్షల వరకు వ్యయం చేసి రెండెకరాలలో టమాట వేశా. ప్రస్తుతం టమాట రైతులకు నష్టాలు తప్పడం లేదు. దిగుబడి అధికంగా ఉండడంతో కిలో రూ. 5 నుంచి రూ.10 వరకు మాత్రమే వస్తోంది. గత ఏడు వచ్చిన లాభాలను చూసి పలువురు టమాటా సాగు చేశారు. టమాటాను ప్రభుత్వమే కొని రైతులను ఆదుకునేలా చూడాలి.

-గంగిరెడ్డి, బలిజపల్లె

డివిజన్‌కు చేరిన విత్తనకాయలు

- సబ్సిడీ వేరుశనగ విత్తనాల ధర బస్తా రూ.5,580
- 7 వేల క్వింటాళ్ల చేరిక
- ఆదేశాలు అందాకే రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ



పలమనేరు ఆర్ఎస్‌కేకు చేరిన కే-6 వేరుశనగ విత్తనకాయలు

పలమనేరు: పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌కు సంబంధించి ఈ ఖరీఫ్ సీజన్‌కు వేరుశనగ విత్తనకాయల సబ్సిడీ ధర బస్తా(30 కిలోలు) రూ.5,580గా ప్రభుత్వం నిర్ణయించింది. డివిజన్‌లోని ఏడు మండలాలకు సంబంధించి ఇప్పటి వరకూ ఏడు వేల క్వింటాళ్ల విత్తనకాయలు ఆయా రైతు సేవా కేంద్రాలకు చేరుతున్నాయి. అయితే విత్తనాలకు ఎప్పటినుంచి పంపిణీ చేయాలో ఆదేశాలు అందలేదని స్థానిక వ్యవసాయశాఖ ఏడీ గీతా కుమారి తెలిపారు.

40శాతం రాయితీతో కదిరి–6 రకం విత్తనాలు

ఆగస్టులో బెట్టను తట్టుకునే రకమైన కదిరి–6 ఈ పర్యాయం సైతం వచ్చింది. బస్తా(30కిలోలు) పూర్తి ధర రూ.9,300 కాగా 40 శాతం సబ్సిడీ రూ.3,720 పోనూ రైతు రూ.5,580 చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన కిలో విత్తనకాయల ధర రూ.56. అదే బహిరంగ మార్కెట్‌లో కిలో ధర రూ.110 పలుకుతోంది. మరోవైపు ఎక్కువగా విత్తనకాయలు బ్లాక్ మార్కెట్‌కు చేరే అవకాశాలు లేకపోలేదు. వేరుశనగ సాగుచేయని రైతులు ముందుగానే పాస్‌బుక్కు, ఆధార్‌కార్డులిచ్చి తీసుకున్న విత్తనాలను అధిక ధరలతో వ్యాపారులకు అమ్ముకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికి అధికారులు చెక్ పెట్టే దిశగా దృష్టి సారించాల్సి ఉంది.

అస్మదీయులకే కొత్త రేషన్ కార్డులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పనప్పటి నుంచి సంక్షేమ పథకాల అమలు మాటలా ఉన్నా కోతలకే ప్రాధాన్యత ఇచ్చి పేదల కడుపు కొడుతోంది. కేవలం కూటమి మద్దతుదారులకు మాత్రమే పథకాల ఫలాలు అందుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం కొత్త కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తోంది. సరైన వసతులు కల్పించకపోవడంతో దరఖాస్తుదారులు సచివాలయాల వద్ద మండుటెండలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. రేషన్ కార్డులను అర్హులకు ఇస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.



కొత్త కార్డు దరఖాస్తు కోసం సచివాలయం వెలుపల వేచి ఉన్న ప్రజలు

- గత ప్రభుత్వంలోని కార్డుల తొలగింపునకు సిద్ధమైన యంత్రాంగం
- కొత్త కార్డుల కేటాయింపులోను కుతంత్రాలే
- ఇప్పటికే కుప్పంలో 2,800 కార్డుల తొలగింపు
- గత ప్రభుత్వం మేలు చేస్తే 'కూటమి' ద్రోహం చేస్తోందని మండిపడుతున్న బాధితులు

కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గత ప్రభుత్వం 56,134 రేషన్ కార్డులకు మంజూరు చేసి పేదలను ఆదుకుంది. కార్డుల మంజూరు విషయంలో పార్టీకతీతంగా, అర్హతే ప్రామాణికంగా పారదర్శకత పాటించడంతో వేలాది కుటుంబాలకు మేలు కలిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనికి పాతర వేసింది. వీటిలో వివిధ కారణాల పేరుతో 2,800 కార్డుల వరకు తొలగించినట్లు సమాచారం. కార్డులు తొలగించిన వారిలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, సాధారణ ప్రజలే ఎక్కువగా ఉన్నారు.

దరఖాస్తులను కూటమి నేతల శల్యపరీక్ష

కొత్త రేషన్ కార్డులను కూటమికి మద్దతుదారులకే ఇవ్వాలనే అధికారులకు అనధికారిక ఆదేశాలు సైతం అందినట్లు తెలుస్తోంది. కుప్పంలో అయితే ఏ పథకం అందాలన్నా వారు కూటమి కార్యకర్తలు, మద్దతుదారులై ఉంటేనే ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను కూటమి నేతలు శల్య పరీక్ష చేస్తున్నారు. దరఖాస్తుదారులు వైఎస్సార్ సీపీకి చెందిన వారు, ఇతరులు అయితే నిర్దాక్షిణ్యంగా తొలగించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో కొంత పేదలు దరఖాస్తు చేసుకోవడానికి సుముఖత చూపడం లేదని తెలుస్తోంది.

గత ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్న పేదలు

రేషన్‌కార్డు లబ్ధిదారులు గత ప్రభుత్వం చేసిన మేలును నెమరేసుకుంటున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండానే ఇంటి వద్దకే వలంటీర్లతో కార్డులు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని, కేవలం అర్హులైతే చాలు పథకాల తరహాలోనే కార్డులు ఇంటి వద్దకే వచ్చేవని, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడం, మార్పులు–చేర్పుల కోసం అగచాట్లు పడుతున్నారు.

భక్తిప్రపత్తులతో నాగప్రతిష్ఠ

వి.కోట: మండలంలోని ఇటికరాళ్లపల్లె సమీపాన గణపతి సమేత శ్రీ నాగరాజ, నాగపత్ని, నాగమాతృక, నాగదేవత శిలా విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిప్రపత్తులతో నిర్వహించారు. బుధవారం గణపతి హోమంతో వైదిక కార్యక్రమాలు మొదలయ్యాయి. గురువారం ఉదయం 4 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల హోరు నడుమ విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం అశ్వర్థ వృక్షంతో వేప చెట్టుకు కల్యాణోత్సవం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.



విగ్రహ ప్రతిష్ఠాపన దృశ్యం

'సిందూర్' విజయోత్సవ ర్యాలీ

చిత్తూరు కార్పొరేషన్: పెహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్‌పై భారత్ త్రివిధ దళాలు 'ఆపరేషన్ సిందూర్' పేరిట దాడులు చేసి ఉగ్రవాద శిబిరాలు, వైమానిక స్థావరాలను నేలమట్టం చేయడంపై భారత్ ప్రజానీకం సంబరాల్లో మునిగి తేలుతోంది. ఈ విజయం పురస్కరించుకుని సైనికులకు మద్దతుగా గురువారం సాయంత్రం చిత్తూరులో మహిళలు జాతీయ పతాకాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ మహిళా సమన్వయ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద నుంచి నినాదాలు చేసుకుంటూ నగరవీధుల్లో తిరిగారు. పాకిస్తాన్‌పై మనదేశం స్పందించిన తీరుకు యావత్తు ప్రపంచమే విస్తుపోయిందని, మన సైనిక సత్తా ఏమిటో ప్రపంచ దేశాలకు చాటిచెప్పగలిగామన్నారు. కార్యక్రమంలో నాయకులు అనురాధ, లక్ష్మీప్రసన్న, సుకన్య, సుందరి, లీల, దీప, హేమలత, నాయకులు చిట్టిబాబు, రామభద్ర తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

నోటీస్ బోర్డు

31న పౌర హక్కుల దినోత్సవం

- సదుం: ఈనెల 31న గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తన కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జయప్రకాశ్ తెలిపారు. ప్రజలు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

డబ్బులిచ్చుకో..ఆక్రమించుకో!

- అధికారులు, నేతల అండతో దర్జాగా పనులు
- రాత్రికి రాత్రే వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
- మున్సిపల్ సమావేశంలోనైనా చర్చించేరా..!?



పలమనేరులోని బసవన్నగుడి వెనుక మదనపల్లి రోడ్డులో అక్రమంగా వెలసిన షెడ్డు

పలమనేరు: మున్సిపాలిటిలోని ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు జోరందుకున్నాయి. ఖాళీస్థలం కనిపిస్తే చాలు అక్కడ రాత్రికి రాత్రే తాత్కాలిక షెడ్లు వెలుస్తున్నాయి. కూటమి నేతల అండ, అధికారుల సహకారంతోనే విచ్చలవిడిగా ఆక్రమణలు సాగుతున్నాయనే విమర్శలొస్తున్నాయి. పట్టణంలో పలుచోట్ల మున్సిపల్ స్థలాల్లో ఇప్పటికే ఆక్రమణలు జరిగాయి. తాజాగా పట్టణంలోని మదనపల్లె రోడ్డులో సత్య బిల్డింగ్‌కు ఎదురుగా బసవన్న గుడి వెనుకవైపున్న డ్రైన్‌పై ఓ వ్యక్తి రాత్రికి రాత్రే రేకుల షెడ్డును కట్టేశాడు. దీని వెనుక ఆ ప్రాంతానికి చెందిన ఓ అధికార పార్టీ నేత హస్తంతోనే ఈ వ్యవహారం సాగినట్టు ప్రచారంలోకి వచ్చింది. మున్సిపల్ అధికారులతో పర్మిషన్ కోసం ఆలయానికి చెందిన వారి ద్వారా ఆరునెలల ఖాళీస్థలం లీజు అగ్రిమెంట్ రాయించుకొన్నట్టు తెలిసింది. దీనిని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు చూపెట్టి ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు చెల్లించేదుదకు ప్లాన్ చేసినట్టు సమాచారం. అయితే గుడి ప్రహరీ గోడకు వెనుకనున్న మున్సిపల్ డ్రైన్ స్థలానికి అగ్రిమెంట్ ఆలయం వాళ్లు ఎలా ఇస్తారని చెప్పడంతో ఈ వ్యవహారం ఆగిందని తెలిసింది. కానీ అధికార పార్టీ నేతల అండతో సాగిన ఈ అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు తొలగించేందుకు సాహసించడం లేదు. దీంతో ఆ యజమాని దుకాణంలో ఎంచక్కా చెక్కల వ్యాపారం చేస్తున్నాడు. ఈ వ్యవహారంలో రూ.50 వేల వరకూ చేతులు మారినట్టు తెలిసింది. దీనిపై స్థానిక టీపీఎస్ ఇందిరను వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చినమాట నిజమేనన్నారు. అక్కడ కట్టిన నిర్మాణాన్ని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా పట్టణంలో చాలావరకు ఆక్రమణలు మున్సిపల్ అధికారుల ద్వారా జరగడంతో దీనిపై ఈనెల 31న జరిగే సాధారణ సమావేశంలో సభ్యులు లేవనెత్తి పట్టణంలో ఇప్పటివరకూ సాగిన ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.